క్లుప్తంగా

ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు ఎన్ఆర్ఐ విద్యార్థి ఎంపిక


సూర్యప్రకాష్

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న తాతా సాయి ప్రకాష్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఏపీఎల్‌కు ఎంపికైన సూర్యప్రకాష్‌ను కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రబాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ గౌతు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



వెల్వడం(మైలవరం): వెల్వడం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. మైలవరం మండలం వెల్వడం గ్రామ దళితవాడకు చెందిన సంది పాము శేషగిరి పాదానికి గాయమైంది. వైద్యులు కాలికి శస్త్రచికిత్స చేయాలని సూచించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెల్వడం గ్రామ నాయకులు యరమల రాం భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



మైలవరం: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు తనయుడు, ఎస్వీజీఎన్నార్ విద్యా సంస్థల కరస్పాండెంట్ సూరానేని వెంకట నారాయణ నివృతరావు అన్నారు. మైలవరం శ్రీ చైతన్య విద్యార్థులు పి.శ్రీనిధి, ఎస్. మణిశంకర్ పదో తరగతిలో 594 మార్కులతో మైలవరం మండలంలో టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా నివృతరావు శనివారం విద్యార్థులను శాలువాలతో సత్కరించి ఆశీర్వదించారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఆర్ఐ వినోద్, ప్రిన్సిపాల్ రత్నదుర్గ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటం ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల వెంట గ్రామోత్సవం జరిపారు. పల్లకీ తమ ఇళ్ల ముంగిటకు రాగానే భక్తులు నీళ్ల వారబోసి టెంకాయలు కొట్టారు. ముందుగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

96 మందికి వైద్య సేవలు



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 96 మందికి రక్త పరీక్షలు చేసి 92 మందికి పలు రకాల వ్యాధులకు సంబంధించి వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వీరులపాడు: మండలంలో జూన్ పదోతేదీ వరకు 144 సెక్షన్ విధించినట్లు మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ రాజకిశోర్ శనివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులకు అందుబాటులో అన్ని సేవలు

- విత్తు నుంచి విత్తనం వరకు అన్నీ ఇక్కడే
- ఆర్‌బీకేల ఏర్పాటుతో తప్పిన పడిగాపులు
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

62	51
నియోజకవర్గంలో మొత్తం రైతు భరోసా కేంద్రాలు	ఉద్యోగుల సంఖ్య: (వ్యవసాయ శాఖ సిబ్బంది అదనంగా పనిచేస్తారు)

నియోజకవర్గంలో రైతులు : **45,700**


గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద విత్తనాల కోసం రైతుల పడిగాపులు (ఫైల్)


కుంటముక్కల గ్రామంలో రైతులకు మిత్ర, శత్రు పురుగులపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీకే, వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

మైలవరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా వారికి అన్ని సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) ఏర్పాటు చేసింది. వీటి ద్వారా వ్యవసాయానికి అవసరమైన సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తోంది. ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తీసుకువచ్చింది. సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాలతో పాటు ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీకే అందిస్తున్నారు. కౌలు రైతులకు పంట సాగు పత్రాలు కూడా మంజూరు చేస్తున్నారు. పంట నమోదు (ఈ క్రాప్ బుకింగ్) నుంచి రైతులు పండించిన వివిధ రకాల ఉత్పత్తులు ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకునే వరకు అన్ని సేవలు ఆర్‌బీకేల ద్వారా అందజేస్తున్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అని వ్యాఖ్యానించి తన పాలనలో రైతులను చిన్న చూపు చూశాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం రైతులకు పండగగా మారింది. ప్రభుత్వం అందజేస్తున్న తోడ్పాటుతో సాగును సంతోషంగా చేసుకుంటున్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వ్యవసాయ శాఖ మండల అధికారి కార్యాలయం వద్ద పడిగాపులు పడేవారు.

ఆర్బీకేలలో మరికొన్ని సేవలు..

రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రైతుల పక్షపాతిగా పేరుపొందారు. పంట నమోదుతో రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నారు. రైతులు తాము పండించిన పంటలు ఈ క్రాప్ ద్వారా బుకింగ్ అయితే పంటల బీమాకు అర్హత వస్తుంది. అతి వృష్టి, అనావృష్టి తదితర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టంపై సర్వే చేసి రైతులకు నిర్దిష్ట గడువులోపే పరిహారం చెల్లించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్‌లు, పవర్ స్ప్రేయర్‌లు, పశువులకు దాణా, గడ్డి విత్తనాలు తదితరాలు ఆర్బీకేల ద్వారా పొందవచ్చు. రైతులకు నాన్ సబ్సిడీ కింద అవసరమైన రుణాలు కూడా ఆర్‌బీకేల ద్వారా అందించే వెసులుబాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించింది. పంటలకు మద్దతు ధర లేనప్పుడు కనీస మద్దతు ధరతో రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తారు.


మైలవరం సూరిబాబు పేటలోని రైతు భరోసా కేంద్రం


వెల్వడం గ్రామ ఆర్‌బీకేలో రైతులకు విత్తనాలు అంజేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది, ప్రజాప్రతినిధులు (ఫైల్)



జి.కొండూరు మండలం చెరువు మాధవరంలోని రైతు భరోసా కేంద్రం

పుస్తక పఠనం అలవరచుకోవాలి


నూజివీడు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

తిరువూరు: విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానదాయక పుస్తక పఠనం కూడా అలవరచుకోవాలని తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు.

స్థానిక గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పెద్ద బాలశిక్ష, జనరల్ నాలెడ్జ్ పుస్తకాల పఠన ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజూ కనీసం ఒక గంటసేపు పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. గ్రంథాలయాల్లో అన్ని పుస్తకాలూ అందుబాటులో ఉంటాయని చెప్పారు. వేసవి సెలవులు ముగిసేవరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు.

పెనుగొలను(గంపలగూడెం): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో శనివారం నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించారు. ప్రతి రోజూ విద్యార్థులతో కథల పఠనం, కథలు చెప్పించడం, కాగితపు బొమ్మల తయారీ, గుండ్రని దస్తూరీ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి పద్యాలను చదివించారు. నీతి కథలు చెప్పించారు. ఈ సందర్భంగా పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు వివరించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు అలవాటు కాకుండా ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవాలన్నారు. దీనివల్ల విజ్ఞానం పెంపొందడంతోపాటు అనేక విషయాలు తెలుస్తాయని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదం చేశాయని వివరించారు. విద్యార్థులతో చెస్, క్యారమ్స్ తదితర ఆటలను ఆడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో ప్రతి రోజూ గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

తిరువూరు సీఐ అబ్దుల్ నబీ

తిరువూరు: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ కోరారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం పెట్రోలు బంకుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం కొన్ని ప్రాంతాల్లో హింసాయుత ఘటనలు జరుగుతున్నందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇకపై పెట్రోల్, డీజిల్ లూజ్ సేల్స్ చేయవద్దని కోరారు.

నిబంధనలు పాటించాలి..

144 సెక్షన్, 30 పోలీస్ చట్టం అమలులో ఉన్నందున నలుగురికన్నా ఎక్కువమంది ఒకచోట గుమికూడి ఉండరాదని, ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించరాదని సీఐ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్దేశ పూర్వకంగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల్ని, కార్యకర్తల్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, వదంతులు ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా కాల్చడం నిషిద్ధమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, యువత బైకులకు సైలెన్సర్లు తీసి ఎక్కువ శబ్దం చేస్తూ వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎక్కువ శబ్దాలు చేసే డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం, రెచ్చగొట్టే పాటలు, సాహిత్యం ప్రచారం చేయడం నేరమన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు


విద్యార్థులకు మెమెంటోలు అందజేసిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు

వత్సవాయి : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు సూచించారు. వత్సవాయి జెడ్పీ పాఠశాలలో శనివారం జిల్లేపల్లి ఏసురత్నం, నాగరత్నం జ్ఞాపకార్థం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేసి అభినందించారు. మండలంలో ప్రథమ స్థానం సాధించిన గురుకుల పాఠశాలకు చెందిన ఎస్‌కే ఇస్మాయిల్, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన జెడ్పీ పాఠశాల విద్యార్థినులు గుంటూరు రాజ్యలక్ష్మి, మాతంగి కీర్తనభాయిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరుమీదుగా ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుడు జిల్లేపల్లి సుధానంద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. భవిష్యత్‌లో అత్యుత్తమ ఫలితాలను సాధించాలంటూ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆర్ అశోక్‌కుమార్, జరీనా, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం కృష్ణయ్య, నాయకులు ఎస్‌కే హుస్సేన్, అల్లిక నరసింహరావు, జి.ముక్తేశ్వరరావు, జి.పల్లవి, సీఆర్పీ యేశపోగు రవిబాబు, గోవర్ధన్, బాబురావు, పురుషోత్తమ్, గోవిందయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఘాట్‌రోడ్డు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కొండపై నున్న స్వయంభు జ్వాలా నరసింహస్వామివారి సన్నిధానానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డు అందుబాటులోకి వచ్చిందని ఈవో హేమలతాదేవి తెలిపారు. ఘాట్ రోడ్డు లేకపోవడంతో గతంలో ఆలయానికి వెళ్లేందుకు భక్తులు నడకదారినే ఆశ్రయించేవారు. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన దాత సహకారంతో ఘాట్ రోడ్డు నిర్మించారు. దీంతో భక్తులు వాహనాల ద్వారా కూడా కొండపైకి వెళ్లే సదుపాయం ఏర్పడింది. కొండపైకి వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు సదుపాయం అందుబాటులోకి రావడంపై భక్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

హనుమాన్ జెండాలు పంపిణీ



జి.కొండూరు(ఇబ్రహీంపట్నం): జి.కొండూరు గ్రామంలో గడప గడపకు హనుమాన్ జెండాలను శనివారం పంపిణీ చేశారు. స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం అధ్యక్షుడు లంకోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ 1న ప్రతి గడపపై హనుమాన్ జెండా ఎగురవేయాలని కోరారు. వేడుకల విజయవంతానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు, అభయాంజనేయ భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


తిరువూరులో వాసవీమాతకు పూజలు


పుట్రేలలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

గంపలగూడెం: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భజన మందిరం, భ్రమరాంబికా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. ప్రత్యేక అలంకరణ చేసి మల్లెపూలతో అమ్మవారికి విశేష అర్చన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వేములపల్లి రామకృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తగుండ్ల నరసింహారావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

- **తిరువూరు:** వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరు రుక్మిణీ కృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాసవీమాతకు 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. క్లబ్ నిర్వాహకులు నాళ్ళా వెంకట రామారావు, నాళ్ళా సుధాకర్, సతీష్, నరసింహరాజు, కృష్ణారావు, రాయల చంద్రకళ, వెంకటరమణ, సూర్యప్రకాశరావు, స్రవంతి పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ మాత జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళలు ఆధ్వర్యంలో ఉదయం వాసవీ మాతకు ప్రత్యేక అలంకరణ, కుంకుమ పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
- **పుట్రేల (విస్సన్నపేట):** పుట్రేల గ్రామంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను పుట్రేల, నూతిపాడు ఆర్యవైశ్య సంఘం సహకారంతో శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాళ్ల చిన్న సత్యంబాబు, మండల గౌరవాధ్యక్షుడు కుక్కడపు నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కంభంపాటి బద్రీనాథ్, గౌరవ సలహాదారుడు కుక్కడపు హనుమాన్ వెంకటరత్నం, పుట్రేల ఆర్యవైశ్య ప్రముఖుడు చేడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విస్సన్నపేటలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో ప్రదర్శన జరిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అనాథాశ్రమాల్లో అన్నదానం

తిరువూరు: స్థానిక అనాథాశ్రమాల్లో శనివారం పలువురు దాతలు వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. రమణ మహర్షి అనాథాశ్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంపాటి ప్రకాశరావు, మారబత్తుల గోపాల్, వెంపాటి డైమండ్ తదితరులు దివ్యాంగులకు అన్నదానం చేశారు. కోకిలంపాడు రోడ్డులోని అమ్మ ప్రేమాశ్రమంలో తిరువూరుకు చెందిన తిగుళ్ల కేశవరావు, రాకేష్ వితరణతో అన్నదానం చేశారు.

మజ్జిగ పంపిణీ

మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని లక్ష్మీ గణపతి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు చామర్తి వెంకట సీతారామాంజనేయులు సతీమణి దివంగత లక్ష్మీతాయారు జ్ఞాపకార్థం కుమారులు చామర్తి వెంకట కృష్ణమూర్తి, వెంకట శ్రీనివాసరావు మజ్జిగ పంపిణీకి సహకారం అందించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య ప్రముఖులు మోహనేష్, లహరిప్రియ, మహేష్, శ్రీను, రవి, కృష్ణమూర్తి, శంకరరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు ఆయా గ్రామాల్లోని శాఖా పరమైన ప్రగతి నివేదికలు ముందుగా పరిపాలనాధికారికి అందజేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, శాశ్వత ఆహ్వానితులు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం



తిరువూరు: స్థానిక పాత తిరువూరులో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళకు పలువురు దాతలు సేకరించిన రూ.లక్షా 50 వేల ఆర్థికసాయాన్ని మండల విద్యా శాఖ కార్యాలయంలో శనివారం అందజేశారు. పాత తిరువూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థిని తల్లికి క్యాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించాలని ఆమె కుటుంబ సభ్యులు కోరారు. ఉపాధ్యాయులు స్పందించి విరాళాలు సేకరించారు. ఆర్థికసాయం అందజేసిన దాతలకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఓలు రామకృష్ణ, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

జుజ్జూరులో పోలీసు కవాతు

వీరులపాడు: మండల పరిధిలోని జుజ్జూరులో ఎస్ఐ మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహాలక్ష్మణుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు. జూన్ 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ రోజు కూడా ప్రజల సహకరించాలని కోరారు. మండలంలో 144 సెక్షన్ ఉన్నందువల్ల ప్రజలెవరూ గుమికూడి ఉండవద్దని సూచించారు. ఎన్నికల ఫలితాల రోజు అనుమతి లేకుండా ర్యాలీలు, డీజేలు వంటివి ఏర్పాటు చేయవద్దన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.